జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం




## వరంగల్

ములుగు - మహబూబాబాద్

జనగామ - జయశంకర్ భూపాలపల్లి - హన్మకొండ

శుక్రవారం | 27 | ఫిబ్రవరి | 2026 ◆ పేజీలు : 6

## జనగామ జిల్లా నూతన కలెక్టర్ గా సందీప్ కుమార్ ఝా బాధ్యతల స్వీకరణ



**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26 (ప్రజాజ్యోతి ):** జనగామ జిల్లా కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న రిజ్వాన్ బాషా షేక్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ, కుత్బుల్లాపూర్, జోనల్ కమిషనర్ (2014 కేడర్ ఐఏఎస్ అధికారి ) సందీప్ కుమార్ ఝా నూతన కలెక్టర్ గా నియమితులయ్యారు. జనగామ జిల్లా కలెక్టర్ గా సందీప్ కుమార్ ఝా గురువారం మధ్యాహ్నం బాధ్యతలను స్వీకరించారు.



- అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
- గోదావరి పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి
- పంచాయతీరాజ్,స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే విధంగా సిద్ధం చేయాలని, జిల్లాలో వివిధ శాఖలలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి,గ్రామీణ నీటి సరఫరా,స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు.గురువారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క సారలమ్మ వన దేవతలను మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర,ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి దర్శించుకున్నారు.అనంతరం మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర,ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ చిత్రామిశ్రా లతో కలిసి మేడారంలోని హరిత హోటల్ లో మేడారం మాస్టర్ ప్లాన్,జంపన్నవాగు అభివృద్ధి పనులు,ఇందిరమ్మ ఇండ్లనిర్మాణం, గోదావరి పుష్కరాల నిర్వహణ, వేసవి కాలంలో త్రాగునీటి

మిగతా 2 లో...



## హనుమకొండ జిల్లా కలెక్టర్ గా చాహత్ బాజ్ పాయ్ నియామకం

**హనుమకొండ, ఫిబ్రవరి 26, (ప్రజాజ్యోతి):** హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్గా ఐఏఎస్ అధికారి చాహత్ బాజ్ పాయ్ నియమితులయ్యారు. ప్రస్తుతం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్గా విధులు నిర్వహిస్తున్న ఆమెను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసి హనుమకొండ జిల్లా కలెక్టర్గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు హనుమకొండ కలెక్టర్గా కొనసాగిన స్నేహ శబరిష్ మహబూబాబాద్ జిల్లా కలెక్టర్గా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో చాహత్ బాజ్ పాయ్ బాధ్యతలు స్వీకరించనున్నారు.అదనపు బాధ్యతలు కూడా చాహత్ బాజ్ పాయ్ కలెక్టర్ హోదాతో పాటు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్గా కూడా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. దీంతో జిల్లా పరిపాలనతో పాటు నగర అభివృద్ధి కార్యక్రమాలపై సమన్వయం మరింత బలపడనుంది. పరిపాలనా అనుభవం చాహత్ బాజ్ పాయ్ ఇప్పటికే పలు కీలక హోదాల్లో పనిచేసి పరిపాలనా అనుభవాన్ని సంపాదించారు.నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, పారిశుధ్య నిర్వహణ, ప్రజాసమస్యల పరిష్కారం వంటి అంశాల్లో ఆమె తీసుకున్న

మిగతా 2 లో...

## ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనుల పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్ష

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ కలెక్టరేట్ ఫిబ్రవరి 26 (ప్రజా జ్యోతి):** జే. చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టనున్న

మిగతా 2 లో...

## బదిలీపై జోగులాంబ గద్వాల్ జిల్లాకి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

- జనగామ జిల్లా పేరును జాతీయ స్థాయికి తీసుకెళ్లిన కలెక్టర్
- జిల్లా అభివృద్ధిలో తన దైన మార్క్
- విద్య, వైద్యం మీద ప్రత్యేక దృష్టి
- నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు నిరంతరం తపన

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26 (ప్రజాజ్యోతి ) :** జనగామ జిల్లా కలెక్టర్ గా రిజ్వాన్ బాషా షేక్ రెండేళ్లు పూర్తి చేసుకొని జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీ అయ్యారు. జనగామ జిల్లాలో సంక్షేమ పథకాల అమలులో కలెక్టర్ అందించిన విశేష సేవలు, అందుకున్న పురస్కారాలు "మన జిల్లా – మన నీరు" అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టి వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేశారు. ఈ క్రమంలో నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా 2025, నవంబర్ 18న దిల్లీలో జరిగిన 6వ జాతీయ జల అవార్డుల కార్యక్రమంలో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీ. ఆర్. పాటిల్ నుంచి దిల్లీలో జల్ సంచాయ్ – జన్ భాగీధారీ 1.0 అవార్డు, జల్ ప్రహరీ సమ్మాన్ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, అమలులో ప్రతిభ చూపినందుకు గాను 2025, అక్టోబర్ 9న హైదరాబాదులోని రవీంద్ర భారతిలో



మిగతా 2 లో...

## హనుమకొండ జిల్లా కలెక్టర్ గా చాహత్ బాజ్ పాయ్ నియామకం

(మొదటి పేజీ తరువాయి...)

నిర్ణయాలు మంచి ఫలితాలను ఇచ్చినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.జిల్లా అభివృద్ధిపై దృష్టి హనుమకొండ జిల్లాలో సాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ఆదాయ శాఖ పరిపాలన, భూ సమస్యల పరిష్కారం, పరిశ్రమల ప్రోత్సాహం, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై ఆమె ప్రత్యేక దృష్టిసారించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా ప్రజల నుండి వచ్చే వినతులు,ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచే దిశగా చర్యలు తీసుకునే అవకాశముంది. పరిపాలనా మార్పులు రాష్ట్ర ప్రభుత్వ తాజా బదిలీలతో హనుమకొండ జిల్లాలో పరిపాలనా మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్త కలెక్టర్ బాధ్యతల స్వీకరణతో జిల్లా అభివృద్ధికి మరింత ఊపు నందుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## బదిలీపై జోగులాంబ గద్వాల్ జిల్లాకి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

(మొదటి పేజీ తరువాయి...)

రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఉత్తమ జిల్లా అవార్డును పొందారు. ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర వహించే ఎన్నికల అధికారులు, సహాయక అధికారులు, పోలింగ్ సిబ్బంది, పరిశీలకులకు, ఎన్నికల నిబంధనలు, విధివిధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించి, సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా ఎన్నికల నిర్వహణను అధికారులు సక్రమంగా, పారదర్శకంగా నిర్వహించినందుకు గాను 16వ జాతీయ ఓటర్ల దినత్సవాన్ని పురస్కరించుకొని 2026, జనవరి 25న హైదరాబాదులోని రవీంద్ర భారతిలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఉత్తమ జిల్లాగా పురస్కారాన్ని పొందారు. అదే విధంగా జాతీయ స్థాయి ఎన్ఏఎస్ – 2024లో తృతీయ తరగతిలో 16వ స్థానం, ఆరవ తరగతిలో 35వ స్థానం, 9వ తరగతిలో 33వ స్థానం సాధించి, దేశవ్యాప్తంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో కేవలం జనగామ జిల్లా విశిష్ట స్థానం సంపాదించినందుకు గాను 2025, సెప్టెంబర్ 5వ తేదీన గురుపూజోత్సవం సందర్భంగా హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలను జిల్లాలోని నిరుపేదలకు అందించేందుకు... నిరంతరం పర్యటనలు, సమీక్షలతో జనగాం జిల్లా ను రాష్ట్ర, జాతీయ స్థాయి లో వివిధ అంశాల్లో ముందంజ లో నిలబడేలా చేసిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కి ప్రజాప్రతినిధులు, అధికారులు ధన్యవాదములు తెలిపారు. జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కి అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

## ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనుల పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్ష

(మొదటి పేజీ తరువాయి...)

కాకతీయ కెనాల్ పనులు అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని సూచించారు. కెనాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించి, వేగవంతంగా పూర్తి చేయాలని రెవెన్యూ మరియు ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్ట్ పనులు సమయానికి పూర్తయితే రైతులకు సాగునీరు అందుబాటులోకి వచ్చి వ్యవసాయ ఉత్పత్తి పెరుగుతుందని ఆమె పేర్కొన్నారు. శాఖల మధ్య సమన్వయంతో సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ ఉమారాణి, సంబంధిత తహసీల్దార్లు ఇరిగేషన్ శాఖల,నేషనల్ హైవే అధికారులు మరియు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## నిరుపేద దంపతులకు హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ చేయూత



**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి26** చెల్పూర్ శివారు పాపయ్యపల్లి గ్రామానికి చెందిన నిరుపేద దంపతులు శీలం స్వప్న, దేవేందర్ లకు హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ అండగా నిలిచి చేయూతనందించారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన సంధ్య కు గొల్లపల్లి గ్రామానికి చెందిన బండి రాకేష్ తో వివాహం జరుగగా రిసెప్షన్ కు హాజరై నూతన వధు వరులను ఆశీర్వదించి పెళ్లి కూతురుకు పట్టుచీర కానుకగా అందజేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి





(మొదటి పేజీ తరువాయి...)

సరఫరా,సెంట్రల్ లైటింగ్,ఎన్ఆర్ ఈజీఎస్ పనులు,అభివృద్ధి పనులపై జిల్లాస్థాయిఅధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. జిల్లాలో వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పూర్తిచేసి లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు నిర్వహించాలని అన్నారు.అదేవిధంగా పూర్తైన ఇండ్లకు డబ్బులు చెల్లించాలని అన్నారు.సిఎం ఆదేశాలమేరకు మేడారంలో మరిన్ని శాశ్వత అభివృద్ధి పనులుచేపట్టాలని, భక్తులకు ప్రశాంతమైన దర్శనం కల్పించేవిధంగా గద్దెలచుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని, ఆదివాసీ పూజారులతో సమావేశాలు నిర్వహించి వారి సూచన సలహాలు మేరకు పటిష్టమైన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని, మేడారం రహదారుల డివైడర్ మధ్య భాగంలో ప్లాంటేషన్ చేయాలన్నారు.అదేవిధంగా జంపన్నవాగులో నిరంతరం నీరు ప్రవహించేలా చూడడం కోసం జంపన్నవాగుపై చెక్ డ్యామ్ ల నిర్మాణం కోసం నిపుణులతో సర్వే నిర్వహించి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేసి అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వేసవి కాలంలో పెండింగ్ పనులు పూర్తి చేయడంలో అధికారులు నిమగ్నం కావాలని వాటికి సంబంధించిన ప్రతిపాదనలు పలు అంశాలు అన్ని సిద్ధం చేసుకోవాలని ఈ మూడు నెలలు వేసవి కాలంలో త్వరితగతిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రభుత్వ నిధులను పకడ్బందీగా అభివృద్ధి కోసం వెచ్చించాలని, ములుగు జిల్లా కీర్తి ప్రతిష్టలను ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించే విధంగా అభివృద్ధి పరచాలని అన్నారు. వచ్చే ఏడాది 2027లో జరగనున్నగోదావరి పుష్కరాల కోసం జిల్లాలోని ప్రధానమైన ఈ పుష్కర ఘాట్ ల వద్ద ప్రజల సౌకర్యార్థం పరిసరాల పరిశుభ్రతతో పాటు కనీస సదుపాయాలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.గోదావరి పుష్కరాలకు ఈ ఘాట్ వద్ద భక్తులు పుణ్యస్నానాలకు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వాహనాల పార్కింగ్,మరుగుదొడ్లు, తాత్కాలిక గదులు, షామియానాలు వంటివి పక్కాగా అందుబాటులో ఉండాలన్నారు. భక్తులకు పూర్తి స్థాయిలో పటిష్ట భద్రత కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కర ఘాట్ వద్ద మెట్లు, ఘాట్ ల వద్ద అవసరమైన మరమ్మతులు చేయించాలని అన్నారు.ఘాట్ వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని, హైమాస్ లైట్లు ఏర్పాటుచేయాలని, రహదారికి మరమ్మతులు జరిపించాలని ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం జిల్లాలో నాలుగు పుష్కర ఘాట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు పకడ్బందీ ప్రణాళికలతో ప్రతి ఒక్కరికి త్రాగునీరు అందించే విధంగా చూడాలనిఅన్నారు. ఎన్ఆర్ ఈజీఎస్ లో కూలీల సంఖ్య పెరిగే విధంగా చూడాలని ఈ పథకం ద్వారా గ్రామానికి అవసరం అయ్యే పనులు ఎంపిక చేయాలని అన్నారు.అంతకుముందు మంత్రి సీతక్క మేడారం హరిత హోటల్లో తాడ్వాయి మండలపరిధిలోని 25 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి / షాదీ ముభారక్ చెక్కులను దివాకర, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రాలతో కలిసి పంపిణీ చేశారు.ఏటూరు నాగారం ప్రాజెక్ట్ ఆఫీసర్ గా విధులు నిర్వర్తిస్తున్న చిత్రా మిశ్రాను రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్ జిల్లా కలెక్టర్ గా ప్రమోట్ చేస్తూ బదిలీ ఉత్తర్వులు వచ్చిన సందర్భంగా మంత్రి సీతక్క ఐటిడిఏ పిఓను శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జీ,సంపత్ రావు, ఎండోమెంట్ అడిషనల్ కమిషనర్ సునీత, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్,మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు,ఆర్డీఓ వెంకటేష్, సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ బస్ డ్రైవర్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు

**పర్వతగిరి, ఫిబ్రవరి 26 (ప్రజాజ్యోతి)** పర్వతగిరి ఎస్సై బి. ప్రవీణ్ సిబ్బందితో కలిసి గురువారం సాయంత్రం మండల పరిధిలోని చింత నెక్కొండ క్రాస్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విజ్ఞాన భారతి విద్యాలయం (చింత నెక్కొండ)కు చెందిన స్కూల్ బస్ నెంబర్ TS 15 UA 4449 అతి వేగంగా, అజాగ్రత్తగా వస్తుండటాన్ని గమనించిన పోలీసులు బస్సును ఆపి తనిఖీ చేశారు. బస్ డ్రైవర్ శ్రీనివాస్ మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు గుర్తించారు. దీంతో అతనిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మద్యం మత్తులో వాహనం నడిపేందుకు అవకాశం కల్పించినందుకు స్కూల్ యాజమాన్యంపై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా స్కూల్ వాహనాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్సై ప్రవీణ్ హెచ్చరించారు.

## గాలివానకు నేల వాలిన మొక్కజొన్న

- **ప్రభుత్వం తమని ఆదుకోవాలని రైతుల వేడుకోలు**



**ఖానాపురం /ఫిబ్రవరి 26(ప్రజాజ్యోతి)** ఖానాపూర్ మండలంలో బుధవారం కురిసిన అకాల వర్షానికి పలు గ్రామాలలో మొక్కజొన్న పంట నేల వాలింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట, ప్రకృతి వైపరీత్యానికి గురవడంతో రైతుల కంట మిగిల్చింది. అప్పుల పాలై కష్టపడి పండించిన పంట, గాలి వాన వల్ల దెబ్బతినడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు జరిగిన పంట నష్టానికి ఆర్థిక సహాయం అందించాలని వేడుకుంటున్నారు.

## వాసవి క్లబ్ మండల అధ్యక్షులు గా మాశెట్టి శ్రీనివాస్ ఎన్నిక




**తరిగొప్పుల ఫిబ్రవరి 26 ప్రజాజ్యోతి** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో తరిగొప్పుల మండలంలో నిర్వహించిన సమావేశంలో వాసవి క్లబ్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షుడిగా మాశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సిద్దిరాజు, కోశాధికారిగా బెజగం ప్రసాద్, ఉపాధ్యక్షులుగా నాగబండి హరీష్, మేలుగు శ్రీనివాస్, కార్యదర్శిగా బెజగం రాజు లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా వనిత క్లబ్ కమిటీ కూడా ఎంపికైంది. వనిత క్లబ్ అధ్యక్షురాలిగా చొక్కారపు రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా బెజగం కవిత, కోశాధికారిగా నాగబండి మానస లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా మాశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ, వాసవి క్లబ్ ఒక సేవా దృక్పథంతో ముందుకు సాగే సంస్థ అని తెలిపారు. సమాజంలో విద్య, వైద్యం, సేవా కార్యక్రమాలు విస్తరించి, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం తమ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసి, మండలంలో క్లబ్ కార్యకలాపాలను మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల ఆర్య వైశ్య సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త కమిటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని సభ్యులు ఆకాంక్షించారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది.

# శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖ చిత్ర నటుడు అడవి శేష్





**హనుమకొండ ఫిబ్రవరి 26 (ప్రజా జ్యోతి)** వరంగల్ మహానగరంలోని చారిత్రక ప్రాశస్త్యం గల శ్రీ భద్రకాళీ దేవస్థానం ను గురువారం సాయంకాలం ప్రముఖ చిత్ర నటుడు అడవి శేష్ భక్తిశ్రద్ధలతో సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారుఆలయానికి చేరుకున్న అడవి శేష్‌కు దేవస్థాన అర్చకులు, అధి కారులుసంప్రదాయబద్ధంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందజేశారు.పూజా కార్యక్రమం అనంతరం అర్చకులు అడవి శేష్‌కు అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి తీర్థప్రసాదాలు అందించారు. దేవస్థాన పరిసరాల్లో ఆయనను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులతో కలిసి ఫోటోలు దిగుతూ ఆయన కొంతసేపు గడిపారు.దేవస్థాన అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై అధికారులు అడవి శేష్‌కు వివరించారు. ఆలయ నిర్వహణపై ఆయన అభినందనలు తెలిపారు.ఈవివరాలను కార్య నిర్వహణాధికారి,సహాయ కమిషనర్ రామల సునీత ఒక ప్రకటనలో వెల్లడించారు.

# విద్యుత్, ప్రజా బాట కార్యక్రమం




**శాయంపేట ఫిబ్రవరి 26 ప్రజా జ్యోతి :** క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా బాట కార్యక్రమాన్ని మండలంలోని హుస్సేన్ పల్లి గ్రామంలో సర్పంచ్ ఎడ్ల స్వరూప సుధాకర్ నైత్రుత్వంలో ర్యాలీ నిర్వహించి విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరూ విద్యుత్ వినియోగంపై బాధ్యతతో వ్యవహరించాలని, విద్యుత్తును సక్రమంగా వినియోగిస్తూ బిల్లులను పెండింగ్లో ఉంచకుండా సకాలంలో చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని సూచించారు. విద్యుత్ సంబంధిత సమస్యలు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ దేవేందర్ నాయక్, సబ్ ఇంజనీర్ చొక్కారావు, ఉప సర్పంచ్ నాగలగాని లక్ష్మణరావు, ఏఎల్ఎం సాగర్, స్పాట్ బిల్లర్ చిరంజీవి, వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల్లో గోస నాలుగు రోజులకే కూలి

- పది రోజులు పని
- ఫీల్డ్ అసిస్టెంట్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కూలీలు
- విచారణ చేయాలని అధికారులకు విన్నపం




**నల్లబెల్లి, ఫిబ్రవరి 26(ప్రజా జ్యోతి):** ఉపాధి హామీ పనుల్లో కూలీలకు అన్యాయం జరిగింది. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదల శ్రమను దోచుకుంటున్నారంటూ మండలం లోని బోలోనపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామతీర్థం చెరువు పూడికతీత పనులకు వెళ్లిన తమకు పూర్తి స్థాయిలో వేతనాలు అందడం లేదని గురువారం కూలీలు ఆందోళన చేపట్టారు.గ్రామానికి చెందిన సుమారు 15 మంది కూలీలు గత పది రోజులుగా రామతీర్థం చెరువు వద్ద ఉపాధి హామీ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రతిరోజూ ఆటో ఛార్జీలు భరించి మరీ పనులకు వెళ్లినట్లు వారు తెలిపారు. అయితే, పది రోజుల పనికి గాను కేవలం నాలుగు రోజుల వేతనం మాత్రమే జమ అయిందని, మిగిలిన ఆరు రోజుల డబ్బుల గురించి అడిగితే ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వారు ఆరోపించారు.తమకు రావలసిన బాకీ వేతనం గురించి ప్రశ్నిస్తే ఫీల్డ్ అసిస్టెంట్ రకరకాల సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని కూలీలు మండిపడ్డారు. ఎండనక వాననక కష్టపడి పని చేశాం. ఆటో ఛార్జీలు కూడా రాని పరిస్థితి నెలకొంది. మా కష్టాన్ని అధికారులు గుర్తించాలి అని బాధితులు వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే విచారణ జరిపి తమకు రావాల్సిన పూర్తి వేతనాన్ని చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రేవూరి

**పరకాల, ఫిబ్రవరి 26,(ప్రజా జ్యోతి):** పరకాల వ్యవసాయ మార్కెట్ నందు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి .గురువారం పరకాల వ్యవసాయ మార్కెట్ యందు ఆర్ ఓ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి మరియు 5000 మెట్రిక్ టన్నుల గోదాం చుట్టూ సి సి రోడ్డు నిర్మాణ పనులకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు మౌలిక వసతులు మెరుగుపరచడం ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. మార్కెట్ యార్డులో తాగునీటి సౌకర్యం కోసం ఆర్ఓ ప్లాంట్ ,గోదాం చుట్టూ సీసీ రోడ్డు నిర్మాణం పనులను చేపట్టమన్నారు.

# పలు వివాహాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ సునీల్



**పరకాల, ఫిబ్రవరి 26, (ప్రజా జ్యోతి ):** పరకాల పట్టణంలో జరిగిన పలు వివాహ, రిసెప్షన్ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్‌కుమార్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.పట్టణంలోని ప్రముఖ స్వర్ణ వ్యాపారి వంగల కోటేశ్వర్–మాధవి దంపతుల ద్వితీయ పుత్రిక చార్మిక–నిఖిలేష్ చారి వివాహానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పోలీసు హోంగార్డ్ కట్కూరి కుమార్–పద్మ దంపతుల ప్రథమ పుత్రుడు నాగరాజు–తేజస్విని వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యారు.మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బండి సారంగపాణి–రమాదేవి దంపతుల కుమార్తె సాయితేజశ్రీ–వివేకానంద చక్రవర్తి వివాహంలో పాల్గొన్నారు. అదేవిధంగా అడప సదానందం–రజిత దంపతుల కుమారుడు సుభాష్–సాయిలిఖిత రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని వధూవరులకు ఆశీస్సులు అందించారు.ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, కౌన్సిలర్లు కొయ్యాడా శ్రీనివాస్, అల్లె దశరథం, నల్లెల్ల కుమారస్వామి, సుధమల్ల రమేష్, టెంపుల్ చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్‌రావు, మాజీ కౌన్సిలర్ మడికొండ శ్రీను, పంచగిరి జయమ్మ–హరి, మేరుగు శ్రీశైలం, చందుపట్ల రాఘవరెడ్డి, జాఫర్ రిజ్వి, ఎర్రబెల్లి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేవాదుల జలాలతో రుద్రగూడెం రైతుల్లో ఆనందోత్సవం



**నల్లబెల్లి, ఫిబ్రవరి 26 (ప్రజా జ్యోతి ):** నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి కృషితో దేవాదుల కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేయడం రైతుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.రుద్రగూడెం పెద్ద తండా శివారులోని కెనాల్‌కు నీరు చేరడంతో పొలాలు పచ్చదనంతో కళకళలాడే రోజులు దగ్గరపడ్డాయి. కెనాల్‌లోకి ప్రవేశించిన నీటిని రైతులతో కలిసి పరిశీలించిన గ్రామ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.కాలువలు సక్రమంగా నిండుతున్నాయని, త్వరలోనే అన్ని ఎకరాలకు నీరు చేరేలా చర్యలు కొనసాగుతున్నాయని రైతులు తెలిపారు.దేవాదుల జలాలు చేరడంతో ఈ సీజన్ పంటలపై ఉన్న అనిశ్చితి తొలగిపోయిందని పేర్కొన్నారు.నీటి లాభాలు ప్రతి రైతు ఇంట చేరాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు.

# రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

- సర్పంచ్ బొంకూరి రవి యాదవ్
- ల్యాదళ్ళలో ప్రజా బాట కార్యక్రమం




**దామెర, ఫిబ్రవరి 26 (ప్రజాజ్యోతి ):** గ్రామంలోని రైతులు, గృహ వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ బొంకూరి రవి యాదవ్ సూచించారు. గురువారం దామెర మండలం ల్యాదెల్ల గ్రామంలో దామెర విద్యుత్ సబ్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రజా బాట నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ బొంకూరి రవియాదవ్ హాజరై మాట్లాడారు. గ్రామంలో నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని తెలిపారు. ఆ తరువాత ఏఈ గుర్రం రమేష్ రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతులు పంట పొలాల వద్ద ఎలాంటి విద్యుత్ కంచెలను ఏర్పాటు చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్



**దామెర, ఫిబ్రవరి 26 (ప్రజాజ్యోతి ):** బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్ పరామర్శించారు. దామెర మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో ఓ పత్రికా విలేకరి, గ్రామ వార్డు సభ్యుడు దాసి రాజ్ కుమార్ తల్లి దాసి సరోజన గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో దమ్మన్నపేటలో దాసి సరోజన భౌతిక కాయాన్ని సర్పంచ్ దుబాసి నవీన్ సందర్శించారు. భౌతిక కాయంపై పూల మాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తమ ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపి, భరోసా కల్పించారు. అలాగే ఒగ్లాపూర్, దుర్గంపేట, దామెర గ్రామాల సర్పంచ్ లు కేతిపెల్లి శ్రీధర్ రెడ్డి, దాసి శ్రీకాంత్, గరిగె కల్పనకృష్ణమూర్తి, దమ్మన్నపేట మాజీ సర్పంచ్ లు పుల్యాల రాణీరఘుపతిరెడ్డి, పాండవుల భిక్షపతి, ఉప సర్పంచ్ పాండవుల రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ దుబాసి అనిల్, గాలి శివ కోటీ, తిగుళ్ల అనితనాగరాజు, ఎన్ రెడ్డి నర్సింహారెడ్డి దుబాసి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి కలెక్టర్ సత్య శారద ఆదేశం

- అభివృద్ధి పనులపై సర్పంచ్ వినతి



**నల్లబెల్లి, ఫిబ్రవరి 26(ప్రజా జ్యోతి):** గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందు కు సాగుతోందని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద పేర్కొన్నారు. గురువారం గంగాదేవిపల్లిలో నిర్వహించిన సర్పంచ్‌ల ఒరియెంటేషన్ శిక్షణ కార్యక్రమం సందర్భంగా నల్ల బెల్లి మండలం బజ్జుతండ సర్పంచ్ రవి చిన్నరాథోడ్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తండాలో ఉన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి ఆమె దృష్టికి తీసుకెళ్లారు.బజ్జుతండాలో మౌలిక వసతుల కల్పన, రహదారులు, తాగునీరు వంటి కీలక అంశాలపై సర్పంచ్ కలెక్టర్‌తో చర్చించారు. తండాను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని, అలాగే తండాను స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలని కోరారు.సర్పంచ్ విన్నపంపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ గ్రామంలో ప్రాధాన్యత క్రమంలో చేపట్టాల్సిన పనులతో కూడిన సమగ్ర 'గ్రామ అభివృద్ధి ప్రణాళిక'ను సిద్ధం చేయాలని సూచించారు. నివేదిక సమర్పించిన వెంటనే నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో తండాకు చెందిన పలువురు ప్రతినిధులు ఉన్నారు.

## పర్వతగిరి ఘాట్ రోడ్డులో ద్విచక్ర వాహన ప్రమాదం

- గాయపడిన యువకుడిని పరామర్శించిన సర్పంచ్ లు





**పర్వతగిరి, ఫిబ్రవరి 26 (ప్రజాజ్యోతి ):** పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన చెనమాల వంశీ, పర్వతాల శివాలయం ఘాట్ రోడ్డులో ద్విచక్ర వాహనం పై ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు వాహనం నుంచి కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. ఘటన అనంతరం అతడిని చికిత్స నిమిత్తం హనుమకొండలోని చక్రవర్తి హాస్పిటల్కు తరలించగా ప్రస్తుతం వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వంశీని పర్వతగిరి సర్పంచ్ శంకర్, కల్లెడ సర్పంచ్ శ్రీనివాస్, దూపతండా సర్పంచ్ తిరుపతి హాస్పిటల్‌లో పరామర్శించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన చికిత్స అందించాలని కోరారు. అలాగే బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి, అవసరమైన సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.

# విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 26 (ప్రజా జ్యోతి )**





విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని అమలు తీరును సమగ్రంగా పరిశీలించారు. వంటగది పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానం, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను స్వయంగా తనిఖీ చేసి, అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పోషకాహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పోషకాహారం అందించడంతో పాటు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తరచుగా పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు.విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా సమతుల ఆహారం అందించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యని,విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, విద్యార్థులు మంచి అలవాట్లు అలవరచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, పాఠశాల ప్రిన్సిపాల్ జీవరత్నం, పాఠశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఐఎంసి ఫలితాల్లో సత్తా చాటిన చిదం సౌమ్య.!

- విద్యార్థినికి పలువురి అభినందనలు



**మల్హర్ ప్రజాజ్యోతి. ఫిబ్రవరి 26 :** మండల కేంద్రమైన తాడిచెర్ల గ్రామానికి చెందిన చిందం భాస్కర్–హాసిని దంపతుల కూతురు చిందం సౌమ్య డెహ్రాడూన్‌లోని అత్యంత ప్రతిష్టాత్మకమైన రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచి క్వాలిఫై యింది.తెలంగాణ స్టేట్ విభాగంలోనే ఒకేఒక అమ్మాయి పాస్ కావడం విశేషమైతే, దక్షిణ భారత దేశం నుండి ఇదే అమ్మాయి విజయం సాధించి అరుదైన రికార్డు సృష్టించడం మరో విశేషం.కాటారం ఆదర్శ హైస్కూల్ ఈ విద్యార్థిని ప్రతిభను గుర్తించి సహకారం అందించిన ప్రిన్సిపల్ కార్తీక్ రావుకు,మ్యాథమేటిక్స్ శిక్షణ అందించిన మనిస్ కుమార్ కు తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులో ఇండియన్ ఆర్మీలో ఉన్నత అధికారిగా దేశానికి సేవ చేయడమే తన ధ్యేయమని సౌమ్య ధీమాగా పేర్కొన్నారు.జాతీయ స్థాయి పోటీలో కాటారం ప్రాంతానికి కీర్తి తెచ్చిన సౌమ్యను, ఆమెకు అండగా నిలిచిన ప్రిన్సిపల్ కార్తీక్ రావును,మనీష్ కుమార్ ను పలువురు ప్రముఖులు అభినందించారు.

## శివ రామాంజనేయ ఆలయ భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే




**టేకుమట్ల ఫిబ్రవరి 26 ప్రజాజ్యోతి:** టేకుమట్ల మండల కేంద్రంలో భక్తుల ఆధ్యాత్మిక ఆకాంక్షలను నెరవేర్చే దిశగా శ్రీ శివ రామాంజనేయ స్వామి నూతన ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ నిర్మాణం గ్రామ ప్రజల ఐక్యతకు,ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ ఆలయ నిర్మాణం కోసం 30 లక్షల రూపాయల నిధులు మంజూరి చేయిస్తానని హామీ ఇచ్చారు. దేవాలయ అభివృద్ధికి తాము సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోటగిరి సతీష్ గౌడ్,మాజీ ఎంపిటిసి అది సునీత రఘు,సర్పంచ్ మాట్ల శ్రీనివాస్,ఆలయ కమిటీసభ్యులు,ప్రజాప్రతినిధులు,గ్రామపెద్దలు,భక్తులు మరియు స్థానిక నాయకులు పెద్దసంఖ్యలోపాల్గొన్నారు.

## వార్డులు అభివృద్ధి చేయడమే ధ్యేయం

- వార్డు కౌన్సిలర్లతో కలిసి వార్డుల పర్యటన
- చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్

**నర్సంపేట ఫిబ్రవరి 26 (ప్రజా జ్యోతి )** నర్సంపేట మున్సిపాలిటీలోని వార్డులు అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతామని నర్సంపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ శ్రీమతి పెండెం శ్రీలక్ష్మీరామానంద్ అన్నారు.నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు, 30వ వార్డు, 6వ వార్డుల కౌన్సిలర్లు బాణాల ప్రసన్న–శ్రీనివాస్, మాదాసి రవి, పున్నం నరసింహారెడ్డి గురువారం ఉదయం పర్యటించిన చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్, వైస్ చైర్మన్ గంధం నరేందర్. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు అభివృద్ధి ప్రధాత దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు 22వ వార్డు, 30వ వార్డు తోపాటు 6వ వార్డులో పర్యటించి వార్డుల సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు,ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో ఎండాకాలంలో నీటి కొరత రాకుండా అవసరమైన దగ్గర బోర్లు వేయించడం జరుగుతుందని, అసంపూర్తిగా ఉన్నటువంటి మురుగునీటి కాలువలను నిర్మించి వార్డులలో ఎలాంటి సమస్య లేకుండా చూస్తామని, అదేవిధంగా సీసీ రోడ్ల నిర్మాణము చేసి పారిశుధ్య సమస్య లేకుండా నిరంతరము వార్డులో మున్సిపల్ కార్మిక సిబ్బందితో పరిష్కరిస్తామని, ఎస్సీ కమ్యూనిటీ హాల్ కి సంబంధించిన స్థలంలో ఎమ్మెల్యే మాధవ రెడ్డి సహకారంతోటి మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణం త్వరలో చేయబట్టబోతున్నామని, అదేవిధంగా వార్డులకు అవసరమైన పనులను ముందుండి చేయించి వార్డుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్, వార్డు ఆఫీసర్స్ చకిలం నాగరాజు, గుగులోతు శ్రీకాంత్, వేమా సూర్యనారాయణ, మున్సిపల్ జవాన్ దేగల కుమార్, బోడ మొగిలి, ఎలక్ట్రిషన్ డిపార్ట్మెంట్ గంట రామిరెడ్డి, వాటెన్ సెక్షన్ ఇంచార్జ కాటా శ్రీనివాస్, వాటర్ లైన్మెన్ రంజిత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దపెల్లి శ్రీనివాస్, కోల చరణ్, కోల వెంకటేశ్వర్లు, మైబు పాషా,కొప్పు అశోక్,పోతిరెడ్డి నరసింహారెడ్డి, గడ్డం శ్రీనివాస్,ధోని చేరాలు,కుచన రాజు,కొప్పు రాజు,పోగుల ప్రభుదాస్,బాణాల రమేష్,తాండ్ర అశోక్,మడికొండ రంజిత్,బోడ సునీల్,అనపర్తి సతీష్,గడ్డం ప్రవీణ్,అగరపు సారయ్య,తదితరులు పాల్గొన్నారు.



## కోనాపురంలో నరసింహస్వామి కళ్యాణ మహోత్సవం వేడుకలు



**చెన్నారావుపేట ఫిబ్రవరి 26 (ప్రజా జ్యోతి)** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం కోనాపురం గుట్టపై స్వయంభూగా వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి 12వ వార్షిక కళ్యాణ మహోత్సవం నేడు ఫిబ్రవరి 27,శుక్రవారం అత్యంత వైభవంగా జరగనుంది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ఉత్సవ ఆహ్వాన పత్రికను గురువారం ఆవిష్కరించారు.రాత్రి 8 గంటలకు స్వామివారి కళ్యాణం నిర్వహించనున్నారు. మార్చి 3 మంగళవారం జాతర ప్రభ బండ్లు తిరుగనున్నట్లు తెలిపారు. మార్చి 7, శనివారం రథోత్సవం జరుగుతుంది అన్నారు.ప్రకృతి సిద్ధమైన కోనేరు, స్వామివారి పాద ముద్రలతో అలరారుతున్న ఈ క్షేత్రంలో జరిగే వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అర్చకులు కసివొజ్జల శివకృష్ణచార్యులు, గ్రామ పెద్దలు కోరారు.

## బర్ల దేవదాస్ కుటుంబానికి పెద్ది సుదర్శన్ రెడ్డి పరామర్శ



**చెన్నరావుపేట ఫిబ్రవరి 26 (ప్రజా జ్యోతి)** చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన గ్రామ పెద్ద బర్ల దేవదాస్ అనారోగ్యంతో మృతి చెందగా, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గురువారం బర్ల దేవదాస్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.నిన్న రాత్రి దేవదాస్ మరణించిన విషయం తెలుసుకున్న పెద్ది నేడు వారి స్వగృహానికి విచ్చేసి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.ఈ సందర్భంగా ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాల్నే వెంకన్న, ఎన్నికల ఇంచార్జి జక్క అశోక్, మాజీ సర్పంచ్ కుండే మల్లయ్య, మహ్మద్ రఫీ, కుసుమ నరేందర్, జెంగిలి రాజు, సాధు నర్సింగరావు, నర్మెట సాంబయ్య, స్థానిక నాయకులు పసునూరి యాకుబ్, రవి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధార్థ పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**చెన్నారావుపేట ఫిబ్రవరి 26 (ప్రజా జ్యోతి)** చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం వేడుకలు అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రధానోపాధ్యాయులుగా మారి పాఠశాల బాధ్యతలను స్వీకరించారు.విద్యార్థులే ఉపాధ్యాయులుగా పాఠశాలలోని పై తరగతి విద్యార్థులు ఒక రోజు ఉపాధ్యాయులుగా అవతారమెత్తి, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. బోధనా పద్ధతులను, క్రమశిక్షణను వారు ప్రదర్శించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ఒక విద్యార్థి ప్రధానోపాధ్యాయునిగా బాధ్యతలు చేపట్టి, పాఠశాల కార్యకలాపాలను పర్యవేక్షించారు. దీని ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత ప్రవర్తనపై అవగాహన పెంచడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పాఠశాల యాజమాన్యం తెలిపింది.కార్యక్రమం ముగింపులో ఉత్తమ బోధన చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు సందడి చేస్తూ ఫోటోలు దిగారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, సిద్దార్థ గురుకుల వ్యవస్థాపకుడు కంది గోపాల్ రెడ్డి,ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**వరంగల్ సిటీ, ఫిబ్రవరి 26(ప్రజాజ్యోతి ):** గిరిజన సంక్షేమ శాఖ విద్యారంగ సమస్యల పరిష్కారానికై మూడుదశల ఉద్యమంలో భాగంగా రెండవ దశ పోరాటంలో గురువారం వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి ద్వారా ముఖ్యమంత్రికి అందించాలని టిపీటీఎఫ్ యూనియన్ ఆధ్వర్యంలో మెమొరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా టిపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఊటుకూరి అశోక్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని, పండిత్ పోస్టులను అప్గ్రేడ్ చేసి సిఆర్టీ డైలీ వేజ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని, అనేక సార్లు సంబంధిత అధికారులకు గిరిజన శాఖ మంత్రికి ప్రాతినిధ్యం చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. వెంటనే గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్, వరంగల్ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్ , జిల్లా భాద్యులు బైరీ స్వామి, మండల భాద్యులు రాజేష్, ఉమేష్, కొమురయ్య మొదలగు వారు పాల్గొనడం జరిగింది.

## టేకుమట్ల మండల కేంద్రంలలో శివ రామాంజనేయ ఆలయ భూమి పూజలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తిరెడ్డి



**టేకుమట్ల ఫిబ్రవరి 26 ప్రజాజ్యోతి న్యూస్:** టేకుమట్ల మండల కేంద్రంలోనిర్మించనున్న శ్రీరామాంజనేయ,శివ ఆలయ భూమి పూజ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తిరెడ్డి , జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి మాట్లాడుతూ, దేవాలయాలు కేవలం ఆరాధన స్థలాలు మాత్రమే కాకుండా మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలని తెలిపారు. గ్రామ ప్రజలఆధ్యాత్మిక అభివృద్ధికిఆలయాలు కేంద్ర బిందువులుగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఆలయనిర్మాణానికి గ్రామప్రజలుఅందిస్తున్నసహకారంఅభినందనీయం అని,త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చదువు రామచంద్రరెడ్డి, మండల అధ్యక్షులు గుర్రపు నాగరాజుగౌడ్, జిల్లా నాయకులు దేశెట్టి గోపాల్,కూర సురేందర్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి బండారి సమ్మయ్య, సుబ్బక్కపల్లె సర్పంచ్ బొడ్డు రాజేందర్, చాటకొల్ల తిరుపతి, మేకల వీరారెడ్డి, పంజాల కుమార్, శ్రీపతి శివ,నూనెటి అరుణ్ కుమార్, బండపల్లి ఉపసర్పంచ్ అశోక్,పార్టీనాయకులు,కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న బి ఆర్ ఎస్ నాయకులు



**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి26** పరశురాంపల్లి గ్రామానికి చెందిన ఎర్రం శ్రీను వసంత దంపతుల కుమార్తె ఎర్రం ప్రవళిక వివాహ వేడుకలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మీ నరసింహ రావు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మోతే కరుణాకర్ రెడ్డి పరశురాంపల్లి గ్రామ సర్పంచ్ ఉడుత సాంబయ్య యాదవ్ చెన్నబోయిన రాజు, చెన్నబోయిన దేవేందర్, ఇట్టవేని బాలరాజు, అనుమండ్ల మోహన్ రెడ్డి, కనుకుంట్ల రాకేష్, కుక్కముడి శంకర్, బండి రందీప్ తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## కల్లెడలో గుడుంబా పట్టివేత

**పర్వతగిరి, ఫిబ్రవరి 26 (ప్రజాజ్యోతి)** పర్వతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్లెడ గ్రామం వద్ద గుడుంబా విక్రయిస్తున్న మహిళను పోలీసులు పట్టుకున్నారు. జెహెచ్ఎన్ శ్రీనివాస్ హెడ్ కానిస్టేబుల్ సిబ్బంది పీసీ చంద్రశేఖర్, డబ్ల్యూపీసీ అనన్యలతో కలిసి కల్లెడ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఒక మహిళ అనుమానాస్పదంగా కనిపించింది. ఆమెను తనిఖీ చేయగా, ఆమె చేతిలో సుమారు నాలుగు లీటర్ల గుడుంబా లభించింది. ఎండి నూరమ్మ, భర్త యాకుబు, వయస్సు 65 కల్లెడ గ్రామ నివాసిగా గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుండి తక్కువ ధరకు గుడుంబా కొనుగోలు చేసి విక్రయిస్తున్నానని ఆమె ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. గుడుంబాతో పాటు మహిళను అదుపులోకి తీసుకుని పర్వతగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## దాడిచేసినా వ్యక్తి పై కేసు నమోదు

**చెన్నారావుపేట ఫిబ్రవరి 26 (ప్రజాజ్యోతి ):** చెన్నారావుపేట మండల కేంద్రంలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన ఐత రాంమోహన్ పై ఐత తిరుపతి దుర్భాషలుఆడుతూ దాడి చేసినా విషయమై బాధితుడి భార్య ఇచ్చిన మేరకు ఐత తిరుపతి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ రెడ్డి తెలిపారు.

## చింతనెక్కొండలో భారీ చోరీ

- - ఇంటి తాళం పగలగొట్టి రూ.2.25 లక్షల నగదు, నగలు ఎత్తుకెళ్లిన దుండగులు

**పర్వతగిరి, ఫిబ్రవరి 26 (ప్రజాజ్యోతి )** మండలంలోని చింతనెక్కొండ గ్రామానికి చెందిన బాల్య శశిరేఖ (55), భర్త సమ్మయ్య, కూలీ వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నారు. ఫిర్యాదురాలు తెలిపిన వివరాల ప్రకారం తేదీ 20-02-2026 న మధ్యాహ్నం సుమారు 3 గంటలకు ఇంటికి తాళం వేసి నర్సంపేటలో ఉన్న తన బిడ్డ ఇంటికి వెళ్లింది. తేదీ 26-02-2026 న ఉదయం సుమారు 11 గంటల సమయంలో, ఆమె ఇంటి పక్కన నివసిస్తున్న సురేందర్ రెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదురాలి అల్లుడు శ్రీనివాస్‌కు ఫోన్ చేసి ఇంటి తలుపు బేడాం పగలగొట్టి ఉన్నట్లు తెలిపాడు. విషయం తెలుసుకున్న ఫిర్యాదురాలు వెంటనే తన ఇంటికి చేరుకొని పరిశీలించగా, బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువా పగలగొట్టి అందులోని విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించింది. వెండి కాళ్ల కడాలు 40 తులాలు (రూ.33,000) వెండి కాళ్ల పట్టీలు 20 తులాలు (రూ.16,000) నల్లపూసల గొట్టాలు (బంగారం) 5 గ్రాములు (రూ.38,000)బంగారు చెవి కమ్మలు 5 గ్రాములు (రూ.38,000)నగదు రూ.1,00,000 మొత్తం సుమారు రూ.2,25,000గా పోలీసులు అంచనా వేశారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దొంగలు తాళం పగలగొట్టి ఈ చోరీకి పాల్పడినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పర్వతగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ పంపిణీ

- తాసిల్దార్ శ్రీనివాస్

**రాయపర్తి ఫిబ్రవరి 26,ప్రజాజ్యోతి** వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 66 మంది లబ్దిదారులకు పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు సకాలంమునకు వచ్చి చెక్కులను తీసుకోవాల్సిందిగా కోరారు.

# సేవకులకు ఇన్సూరెన్స్ పాలసీ సదుపాయం

- క్రిస్టియన్ కమ్యూనిటీ పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం లో పి ఏలేష్

ఏటూర్ నాగారం ఫిబ్రవరి 26 ప్రజా జ్యోతి ములుగు జిల్లా, గోవిందరావుపేట మండలంలోని చల్వాయి ప్రాంతంలో గురువారం ములుగు జిల్లా క్రిస్టియన్ కమ్యూనిటీ పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 12 మండలాల నుండి దాదాపు 300 మంది సేవకులు, పాస్టర్లు హాజరయ్యారు. సమావేశానికి జిల్లా అధ్యక్షులు రెవరెండ్ పి. ఎల్లేశా ప్రభు అధ్యక్షత వహించి ప్రభువాక్యాన్ని బోధించారు. అనంతరం ఆయా మండలాల్లో ఉన్న సమస్యలు, సంఘ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సేవకుల సంక్షేమం కోసం జిల్లా తరపున ఐడి కార్డులు అందజేశారు. ఇంకా మండలాల వారీగా గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీ అమలు విషయంపై చర్చించారు. ములుగు జిల్లాలో 500 మందికి పైగా సేవకులకు త్వరలో గ్రూప్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఐడి కార్డులు అందజేయగా, ఇన్సూరెన్స్ పాలసీలు త్వరలో అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 10 మండలాల ప్రతినిధులు జిల్లా కోర్ కమిటీ సమావేశంలో పాల్గొని పలు ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. సేవకుల సంక్షేమం, సంఘ బలోపేతం దిశగా కృషి కొనసాగిస్తామని నాయకులు తెలిపారు.



## పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘిస్తే వేటు తప్పదు

- బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాల్నే వెంకన్న.




చెన్నారావుపేట ఫిబ్రవరి 26 (ప్రజా జ్యోతి) పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెన్నారావుపేట బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బాల్నే వెంకన్న హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు... చెన్నారావుపేట మండలానికి చెందిన ముగ్గురు సభ్యులను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు గురువారం వెల్లడించారు.పార్టీ నుండి సస్పెన్షన్‌కు గురైన వారిలో కంది శ్వేతారెడ్డి (గ్రామ సర్పంచ్) కంది కృష్ణచైతన్య రెడ్డి జున్నుతుల మహేందర్ రెడ్డి పార్టీ కార్యకర్త ఉన్నట్లు తెలిపారుఅధికార పార్టీల ప్రలోభాలకు లొంగి, రాజకీయ భవిష్యత్తుని ఇచ్చిన పార్టీకి వెన్నుపోటు పొడవడం శోచనీయమని వెంకన్న మండిపడ్డారు.స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారే వారికి ఎక్కడా రాజకీయ భవిష్యత్తు ఉండదని, క్రమశిక్షణ తప్పితే ఎవరినైనా సహించేది లేదని స్పష్టం చేశారు.రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి రావడం ఖాయమని, పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల కన్వీనర్ జక్కు అశోక్ యాదవ్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శి, వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులకు కోనాపురం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మహోత్సవ ఆహ్వానం





చెన్నారావుపేట ఫిబ్రవరి 26 (ప్రజా జ్యోతి) చెన్నారావుపేట మండలంలోని కోనాపురం గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి 12వ వార్షిక కళ్యాణ మహోత్సవ జాతరను పురస్కరించుకుని, గ్రామ పెద్దలు,ఆలయ నిర్వాహకులు గురువారం అధికారులను ఘనంగా ఆహ్వానించారు.చెన్నారావుపేట ఎమ్మార్వో మహమ్మద్ ఆబిద్ అలీ,ఎస్సై రాజేష్ రెడ్డిలతో పాటు పలువురు మండల అధికారులకు జాతర ఆహ్వాన పత్రికలను అందజేశారు.మండలంలో ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ జాతరకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున, శాఖాపరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ స్వామివారి కళ్యాణ వేడుకలకు అందరూ విచ్చేసి జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో కోనాపురం, కాల్ నాయక్ తండా గ్రామాల సర్పంచులు,ఆలయ కార్యనిర్వాహకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగు తో అధిక లాభాలు

- ఆర్ శ్రీనివాస్ రావు






వర్ధన్నపేట, ఫిబ్రవరి 26, ప్రజా జ్యోతి వర్ధన్నపేట మండలం లోని ఇల్లంద గ్రామంలో రైతు తక్కలపల్లి సత్యనారాయణ రావు ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ ఫామ్ సాగులో రైతు అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా ఉద్యాన అధికారి ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగులో నీటి యాజమాన్యం, ఇరుల యాజమాన్యం , సస్య రక్షణ చర్యలు అధిక ఆదాయం పొందడానికి ఆచరించవలసిన మేలైన యాజమాన్యం గురించి వివరించడం జరిగింది. రైతులు పెళ్లి సత్యనారాయణ రావు మాట్లాడుతూ తనకు ఉన్నటువంటి అనుభవాలను రైతులతో పంచుకోవడం జరిగింది ఆయిల్ ఫామ్ మొక్క ఒకసారి నాటితే 30 ఏళ్ల వరకు దిగుబడిస్తుందని ,పశువుల ఎరువు,సహజ సిద్ధ ఎరువులు వాడాలని చెప్పారు .అదేవిధంగాఆయిల్ పాములో కూలీలకు కొరత ఉండదని ఒక ఎకరానికి నికరంగా 10 టన్నుల దిగుబడి వస్తుందని చెప్పడం జరిగింది రైతులకు ఉన్నటువంటి పలు సందేహాలను కూడా నివృత్తి చేయడం జరిగింది. అదేవిధంగా ఈ కార్యక్రమంలో అగ్రనమిమిస్ట్ భవాని ప్రసాద్ మాట్లాడుతూ బిందు సేద్యము ఆటోమోగేషన్ ఎరువులు యాజమాన్యం తదితర వివరాలు వివరించడం జరిగింది,రామ్ చరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ సతీష్ నారాయణ మాట్లాడుతూ జిల్లాలో సాగుతున్న పంట కొనుగోలు విధానం ఫ్యాక్టరీ నిర్మాణం తదితర విషయాలను వివరించారు. గ్రామ సర్పంచ్ బేతి సాంబయ్య మాట్లాడుతూ వాతావరణం మారుతుందని కాలుష్యం తగ్గుతుందని తద్వారా కోతుల బెడద మరియు రైతుకు నికర ఆదాయం ఉంటుందని వివరించారు మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న రాయితీ వివరాలు యూరియా వాడకం గురించి వివరించడం జరిగింది. ఉద్యాన అధికారి రాకేష్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ మరియు ఇతర ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందజేస్తున్న వివరాలు మరియు దరఖాస్తు చేసుకునే విధానం తెలియపరచడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఇల్లంద గ్రామ ఉప సర్పంచ్ ,మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి జిల్లా అధికారులు ,మండల అధికారులు, ఆయిల్ పామ్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్స్ కళ్యాణ్, ప్రణయ్, శివమణి ,వివిధ ప్రాంతం నుండి వచ్చిన సుమారు 200 మంది రైతు సోదరులు రైతులు కుమారస్వామి దేవేందర్రావు తదితరులు పాల్గొన్నారు.

## పగిడిద్ద రాజు జాతర పోస్టర్ ను ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి సీతక్క

- అరెం వంశస్థులు అయిన పగిడిద్ద రాజు ఇలవేల్పు జాతర ను విజయవంతం చేయాలి



ఏటూర్ నాగారం ఫిబ్రవరి 25 ప్రజా జ్యోతి ములుగు జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలోని మేడారంలో నీ హరిత హోటల్ వద్ద భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , గుండాల మండలం , యాపలగడ్డ గ్రామంలో అరెం వంశస్థులు అయిన పగిడిద్ద రాజు ఇలవేల్పు జాతర పోస్టర్ ను ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి సీతక్క జాతర మార్చి 4 , 5 , 6 , 7. లో జరుగుతుంది అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, మేడారం జాతర ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఇర్ప సుకన్య – సునీల్ దొర , సమ్మక్క సారలమ్మ పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు , మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అరెం లచ్చు పటేల్ , సారలమ్మ ప్రధాన పూజారి కాక వెంకటేశ్వర్లు , సమ్మక్క పూజారి సిద్దబోయిన రానా రమేష్, మేడారం సర్పంచ్ పీరీల భారతి – వెంకన్న, ఆదివాసి తుడం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్ , కార్మిక శాఖ జిల్లా అధ్యక్షులు కొంపల్లి శ్రీనివాస్ రెడ్డి , మండల యువజన నాయకులు కోరం నందు , తదితర నాయకులు పాల్గొన్నారు.

కల్లెద వాసికి బీమా మంజూరు..

## - ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన కింద రూ.2 లక్షలు అందజేత



పర్వతగిరి, ఫిబ్రవరి 26 (ప్రజా జ్యోతి) పర్వతగిరి మండలం కల్లెద గ్రామానికి చెందిన ముదురుకోళ్ల యాకయ్య మూడు నెలల క్రితం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన కల్లెద పోస్టాఫీస్ ద్వారా నమోదు చేసుకున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద, ఆయన భార్య నిర్మలకు రూ.2 లక్షల బీమా మొత్తాన్ని మంజూరు చేశారు. ఈ సందర్భంగా వరంగల్ పోస్టల్ సూపరింటెండెంట్ బి. రవికుమార్ నిర్మలకు చెక్కును అందజేశారు. కుటుంబ ఆర్థిక భరోసా కల్పించడంలో ఈ బీమా పథకం ఎంతో ఉపయోగపడుతోందని అధికారులు తెలిపారు. ప్రజలు ఈ బీమా పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నార్త్ సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ లావూరి సైదా నాయక్, పర్వతగిరి ఎస్‌పీఎం కరుణాకర్, బీపీఎం రాజు, ఎంటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.